*పునాది బైటికి కనిపిస్తున్న భవనమంత అందంగా వుండదు. కానీ, పునాది లేక పోతే భవనం నిలిచేదా?*

**అ**మ్మా..అన్న కేక గుండెల్లోంచి చీల్చుకొచ్చింది. వెంటనే 'క్యారు క్యారు' మన్న ధ్వని పిల్ల గాలిలా పలుకరించింది.

అప్పటివరకు గుడ్ల నీళ్ళు కుక్కుకొని కనిపించని దేవుళ్ళందరికీ దణ్ణాలు పెడుతున్న బూదెమ్మ కళ్ళు జలపాతాల్లా వర్షించాయి. "అమ్మయ్య దేవుడు కన్ను తెరిచాడు. పోలేరమ్మ తల్లీ! తల్లీ బిడ్డా చల్లగా వుంటే అంతే చాలమ్మా. రేపు సుక్కురారం చద్ది నైవేద్యం పెడతాను నీకు" అనుకుంటూ కళ్ళు తుడుచుకుంది.

'ఓపాలి చంటిదాన్ని సూసొత్తాను' అని అనుకుంటూ గదిలోకి పోబోయిన బూదెమ్మని లేడీ డాక్టర్ ''ఒక్క నిముషం ఆగాలి" అంటూ అడ్డు పెట్టేసింది.

"ఏం పిల్లా?...."అని అడుగుదామని అనుకుంటున్న ఆమెకి సమాధానంగా ఆ లేడీ డాక్టరు లోనికి పోయేదల్లా వెనుదిరిగి "మగబిడ్డ"అని క్లుప్తంగా చెప్పి తలుపేసుకుంది.

"పోన్లే! వందులాంటి మగబిడ్డ పుట్టి వుంటాడు నా బంగారు బొమ్మకి" అని మురిసిపోయింది బూదెమ్మ.

"బూదా....వ్ నీళ్ళు తెచ్చావే?...."అని అడుగుతున్న మొగుణ్ని చూసి మౌనంగా నీళ్ళకడవ అందుకుని రేవుకి నడిచింది.

"ఒసే.... బూదీ.... నీకూ మనవుడు పుట్టాడంటకదే? అగ్నమ్మ వయ్యావన్న మాట. అంది నిండుగా నవ్వుతూ నీళ్ళు కొస్తున్న రత్తమ్మ.

"అవునే రత్తమ్మా! నా బిడ్డ పానాలు పోయేట్టు బాధపడిపోనాది. ఏమవ్వుద్దో అని కళ్ళలో పేణాలెట్టుకున్నానంటే నమ్ము. పట్నం తీసుకుపోవయ్యా అంటే ఇనకపాయె. నీ తమ్ముడు. డబ్బుల్లేవని గమ్ముగ నూరుకున్నాడు. ఇంక బిడ్డ బాధ సూళ్ళేక నా పాంజేబులమ్మి డాక్టేరు నన్నా తీసుకరమ్మంటే. అప్పుడు పోయిండు నీ తమ్ముడు."


"ఇదో ఓ గంటకితం కన్నది పిల్ల-వండంటిమగబిడ్డని...."అంటూఆగకుండా జారుతున్న కన్నీటిని తుడుచుకుంది బూదెమ్మ.

"డబ్బు....లీ్న మరి దివ్వలేదంటే?" ఆశ్చర్యంగా అడిగింది రత్తమ్మ

లేదన్నట్టు తల వూపుతూ "కాళ్ళావేళ్ళా పడ్డా-లేదు పొమ్మన్నాడంట. ఏం చేస్తాం! మా బిడ్డ కంటె సొమ్మెక్కువంటావా?" అంటూ బూదెమ్మ కాళ్ళకేసి చూసుకుంది. పుట్టింటివాళ్ళు పెట్టిన పట్టాలు. పాంజేబులు లేకపోగా చివరకు మట్టైలైనా లేక బోసిపోయి. మట్టిగొట్టుకొని. బీటలు పడి. పగిలిపోయిన మడాలు. ఎండిపోయిన పాదాలు ఎండిన మాగాణి చేలలాగా వున్నాయి.

"పోన్లే దేవుడు సల్లగా చూశాడు. ఆ చెంబెడు నీళ్ళు పోసి పంపిద్దువుగాని. ఇకనైనా నీ వేంటో తెలుసుకుంటదిలే నీ కూతురు." సానుభూతి ధ్వనించింది రత్తమ్మ గొంతుకలో.

"తెలుసుకొనేదేటుంది? అది బిడ్డ. నేను తల్లిని. ఇప్పుడదికూడా తల్లేగా? దానిబిడ్డ దాన్ని అమ్మా అని పిలువదా! నాకు కూతురై అది నన్నెప్పుడైనా "అమ్మా"



అని పిలిచిందా? నాదగ్గరకొచ్చిందా? చిన్నమ్మ. చిన్నమ్మని సూరమ్మవెంట బడింపె. కన్నతల్లిని సక్కగా లేనని. సక్కగావున్న సూరమ్మని అమ్మా అని వెంటబడితే అది చూసిందా' పేణాలమీద కొచ్చి నా డబ్బులియ్యటానికి సచ్చి పోయింది."అసలుదాని మూలంగానేనాబిడ్డ నాకు ఇంకా దూరమైంది. రత్తమ్మన్నట్లు ఇక దాని సంగతి తెలుస్తుందిలే. యింక ఆ సూరమ్మ మొహం కూతా చూడదు నాబిడ్డ "నాచిటిగనుపుడు, నాబిడ్డ నాదగరే వుంటారు. నేను నీళ్ళు పోస్తాను, పొగ

# బూదెమ్మ

## కాళ్ళబండి రమణ



డపు రాసాను. ఎంచక్కా గోరుముద్దలు కలిపి బువ్వ పెడతాను. సొట్ట బుగ్గల్లో ఎన్నో ముద్దులు ...."ఇంకా ఏవేవో అల్లి బిల్లి వూహల రంగులు ఆమె మొహంలో కదిలాడుతూవుంటే ఆ మాతృ హృదయం ఆనందంతో. ఆనంద నీళ్ళతో నిండి పోయాయి

"బూదెమ్మా. చిన్నమ్మని పిలూ. నా బుకి నీళ్ళుపొయ్యాలి." ఎర్రచీరలో వడిలి, ఇంకా తేరుకోని శరీరంతో. చెమ్మ ఎక్కకుండా చెవులకు కటుకున్న గుడ్డతో ముచ్చటగావున్న బాలింతరాలు మంగని చూసి మురిసిపోయింది "బూదెమ్మా" అని పిలుపుతప్ప "అమ్మా" అని అనిపించు కోని బూదెమ్మ.

మనసులోనిమాట భయం భయం లైటపెడుతున్నట్లు "బాబుకి నీళ్ళు నే పోస్తాలే" అంది కూతురి కేసి చూస్తూ.

"ఏమిటీ? నువ్వు పోసావా? ఆ కట్టె చేతులతో, ఆ గోళ్ళతో బరబరా రుద్దేస్తె ఇంకా ఏమున్నావుందా?" ఈసడించివదే సింది మంగ.

అంతలోనే "చిన్నమ్మా.... బాబుకినీళ్ళు పొయ్యవూ...."అంటూగారాబంగా, మార్దవంగా. ముద్దు ముద్దుగా పిలుస్తూ వెళుతున్న కూతురిని చూస్తూ అప్రయత్నంగా తన చేతులకేసి చూసుకున్న బూదెమ్మ నీళ్ళు

విండిన కళ్ళకు నల్లగా, దుమ్ము పేరుకొని పగిలిపోయి, కాయలుకాసి. గోళ్ళ లో మట్టినిండుకొని మొద్దుబారిన చేతులూ, ఎదురుగా మసిబారిన బండెడు అంట్లు మసక మసకగా కనిపించాయి.

*    *    *

"సామానంతా సర్దుకున్నావా? పిల్లాడి బట్టలు చూసుకున్నావా? మళ్ళీ ప్రయాణంలో యిబ్బంది పడాల్సి వస్తుంది" అంటూ సామానులు చూస్తున్న ప్రకాశరావుకి, పిల్లాడికి పక్కవేసి, పడుకోబెట్టి పక్క సరిచేస్తున్న మంగ పుష్టిగా యెదిగిన అరటి మొక్కలా కనిపించింది.

"చిదిమి దీపం పెట్టుకోవచ్చు" అని అనుకొనేట్టుండే మంగ ఈ మూడు నెలల మంచి పోషణతో మంచుకి తడిసి అర విరిసిన గులాబిలా వుంది తాంబూలం వేసుకున్న పెదవులు పండిన టమాటాల్లాగా తడి తడిగా మెరుస్తున్నాయి.

అలాంటి మంగ ప్రక్కన ముడుచుకున్న మందార మొగ్గలాగా ముడుచుకొని పడుకున్నాడు బాబు.

"వీడికీ మంగ రంగే వచ్చింది. రెండు గుప్పెళ్ళూ మూసుకొని కమ్మగా నిద్దరోతున్నాడు."

బాబు బుగ్గలు రెండూ మెత్తగా సాగదీశాడు ప్రకాశరావు. మురిపెంగా వాడ్ని చూసుకుంటూ. వాడామాత్రం వత్తిడి కూడా భరించలేనట్టు మూల్గి వాళ్ళమ్మకేసి తిరిగి పడుకున్నాడు.

"ఆ.... ఆ .... లేపకండి, మళ్ళీ ఏడుస్తాడు." అంటూ కంగారుగా వాణ్ణి చిచ్చి కొట్టింది.

"బాబు అంతా మీ పోలికేకదూ!" అంది ముద్దుగా బాబుని చూస్తూ.

"కాదు నీ పోలికే" కొంటెగా అన్నాడు ప్రకాశం.

అలా అనిపించుకోవాలనే మంగ ఆరాటం. తన అందాన్ని అందరూ మెచ్చుకోవటం మంగకు చాలా ఇష్టం. మురిపెంగా, ముసిముసి నవ్వులు నవ్వుకుంది.

"బాబుకి నీళ్ళు పొయ్యటం... అవీ.... నాకు రావండీ .... అందుకని మా అమ్మని వెంట తీసుకెళదాం," గోముగా అడిగింది మంగ.

"ఏ అమ్మని?" అర్థంకానట్టు చూశాడు ప్రకాశం. "మీకెన్నిసార్లు చెప్పాను. అమ్మంటే మా చిన్నమ్మని" ఛ్రున లేచింది మంగ.

ఈసారి మరింత ప్రశ్నార్థకంగా అయింది ప్రకాశరావు మొహం. అతని కళ్ళముందు "కొంచెం స్థూల దేహంతో పట్టుచీర గలగలలతో, బంగారునగల బరువుతో రొంటిన దోపుకున్న వెండితాళం చెవుల గుత్తితో, ఎప్పుడూ పనివాళ్ళని సతాయించే సూరమ్మ కనిపించింది.

"ఆవిడ పని చేస్తుందంటావా?" అమాయికంగా అడిగినట్టు, అనుమానంగా అడిగాడు ప్రకాశం.

"ఆవిడ పనిచేయట మేమిటండీ? పనికి పనిమనిషి వుందిగా. బాబుకి నీళ్ళు, అవీ పొయ్యటానికి వుంటుందనిగా నీ," అదీగాక చిన్న పిల్లలున్నప్పుడు ఆయొచ్చినా పాయొచ్చినా పెద్దవాళ్లు కావద్దూ?" అంటూ సగం విసుగుని, సగం విషయాన్నీ ప్రదర్శించింది మంగ

ప్రకాశానికి ఇంక తన నెలసరి బడ్జెట్టులో పెరుగుతున్న ఖర్చులు జెట్ విమానంలా పరుగెడుతున్నట్టు కనిపించాయి.

"పో నీ ....మీ అమ్మనే రమ్మనకూడదూ" ....మీ అమ్మనే అన్న పదాన్ని మరింతగా నొక్కుతూ, నసిగాడు ప్రకాశం "కొద్దిగ ఖర్చుకూడాతగుతుంది" ఓరగా మంగవేపు చూశాడు

ఛెళ్ళున కొట్టినట్లు "చాల్లెద్దురూ, ఆ మొద్దు మొహం బాబుకి నీళ్ళు పోస్తే యిక అయినట్టే. శుచి. శుభ్రం లేకుండా.... పైగా అక్కడివాళ్ళందరికీ...." ఇక ఆపైన మాటలు మింగేసింది మంగ బూదెమ్మనిచూసి తల వంచేస్తూ.

తిపుడు కోసం సావిట్లోకి వచ్చిన బూదెమ్మ చెవులకి ఆ మాటలు గుండెల్లో శూలాల్లా దిగబడ్డాయి. ఒక్కసారి మంగ కేసి చూసి గుడ్లనీరు నింపుకొని తవుడు గోతం భుజంమీద మోస్తూ వెళ్ళిపోయింది.

చింపిరిజుట్టుతో, మురికి గుడ్డలతో ప్రతిరోజూ రేయనక, పగలనక పని చేస్తూ దుమ్ముతో, ధూళితో, ఎండిన నల్లని శరీరంతో, పొలంలో గొడ్డులా పనిచేసి వాటితోనే కలిసిపోయిన ఆ గుంట కళ్ళ మనిషిని రబ్బరు బొమ్మలాంటి మంగ నా తల్లి అని చెప్పడానికి సిగ్గుపడుతోంది.

"దేవుడే అందాల బిడ్డని నా కడుపున వేసి నన్ను మరీ ఒంటరిదాన్ని చేసేశాడు' ఆక్రోశించింది బూదెమ్మ మనసు. తల్లీ దండ్రీ ఈసడించినా, కట్టుకున్న వాని కళ్ళకు గొడ్డులాగా కనిపించినా. అత్త మామలకూ, తోడికోడలికి పనిమనిషిలా మారినా, తనకడుపు పండి తనను ఆదరిస్తుందని, తనను అమ్మాఅని పిలుస్తుందనీ. నెల తప్పిన నాటినుంచీ కలలుకన్న బూదెమ్మ కళ్ళకు మంగరూపం చందమామలావున్నా, మంగమనసు బూదెమ్మపై చంద్రనిప్పులు కక్కింది.

బూదెమ్మ మనసు వర్తమానానికి, గతానికి మధ్య తల డిల్లుతూ వ్యధతో పొర్లుతోంది.

"ఛీ మా అమ్మవి కావు నువ్వు" అని మంగ అసహ్యించుకుని సూరమ్మ డొక్కలో దూరితే అందరూ తనను చూసి పకపక నవ్వారు. అప్పుడే ఈ గుండె తూట్లు పడింది. "నేను మంగకు అమ్మను కానేకాను. కేవలం ఈ యింటి పని మనిషిని మాత్రమే. నేనెప్పుడైనా అమ్మా అన్న పిలుపుకి నోచున్నానా? మంగ అమ్మా ....అని పిలిస్తే అది సూరమ్మనే."

ముద్దు ముచ్చటగా కూతుర్ని పెంచుకున్నానా? దేవుడు నన్ను అన్నివిధాలా అన్యాయం చేశాడు. ఈ బిడ్డకు నేను తల్లిని కాకుండావుంటే ఈనాడు ఈ బాధ ఉండేదేకాదు. కన్నబిడ్డచేత కూడా అసహ్యించుకోబడ్డ తల్లిని నేను.

అసలు తల్లి నా నేను? కాదు. గొడ్డును. గొడ్డుబోతును. కాసుపైనా ఎరగని కాసులసూరమ్మ మంగకు కన్నతల్లి. మోసి కన్న నేను పనిమనిషిని.

ఓహ్.... ఆ కన్న తల్లి గుండెమంట ఆవిరిగామరిగి కన్నీరుగా చల్లారి బూదెమ్మ తవుడు వేసి కలుపుతున్న కుడితి తొట్టిని నింపుతోంది.

*    *    *

తారల ఫొటోలు
శ్రీదేవి.., జయసుధ.., జయప్రద.., జయమాలిని, సుజాత.., మాధవి.. ప్రభ.. కవిత.., ఏయన్నార్, ఎన్టీఆర్.., శోభన్‌బాబు.., కృష్ణ.. కృష్ణంరాజు, మోహన్‌బాబు.. కమలహాసన్.. చిరంజీవి!
వీరిలో ఎవరి ఫొటో కావాలన్నా ఫొటోకి 3 రూ॥లు. ఎం.ఓ. చేయాలి....!
ఫొటోలతోపాటు సినీతారల అడ్రసులున్న పుస్తకం కూడా పంపబడును!
ఎవరి ఫొటో కావాలో వ్రాయడం మరువకండి!
వై.కె.మూర్తి.
దాసరివారి వీధి * విజయవాడ-2.

దీర్ఘ వ్యాధులకు ఉత్తమ వైద్యం
దురభ్యాసములకు లోనై, దాంపత్యసౌఖ్యంపొందలేనివార్కి హెర్నియా, చర్మ వ్యాధులకు పోష్టుద్వారా వరి బీజం(బుడ్డ) ఇస్నోఫిలియా ఉబ్బసం (దమ్ము) జీర్ణాశయ(గ్యాస్ట్రిక్) మూత్ర, స్త్రీల వ్యాధులకు ఆపరేషన్ లేకుండా చికిత్స చేయబడును. -రండి
డా॥ దేవర
3/1 బ్రాడీపేట, గుంటూరు. A.P.

"నా పంటడబ్బు యివ్వమంటున్నారు నాన్నా మీ అల్లుడు." అని మంగ చెప్పినప్పట్నుంచీ కాంతయ్య గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్టయింది. ఉన్న ఎకరం మాగాణి అమ్మాయికి కట్నంగాయిచ్చి మంచి సంబంధమని, పిల్ల సుఖపడితే చాలునని పెళ్ళిచేశారు. పెళ్ళికైన అప్పు కింద ఈ రెండు మూడేళ్ళ పంట కట్టి కూలిడబ్బుల్తో వెళ్ళదీసుకొస్తున్నారు రోజులు. ఈ సంవత్సరం రోగంతో తను పనిచెయ్యలేకపోయినా, బూది వళ్ళువిరుచుకొని మాగాణిలో చేసిన చాకిరీవల్ల తిండికి గింజలుంటాయనుకుంటే ?

అల్లుడు పంట డబ్బు అడుగుతున్నాడు. ఇంకా మనవడికి చిట్టి గొలుసైనా పెట్టలేదని మంగ సాధిస్తూనే వుంది. ఏం చెయ్యాలో? ఏమీ తోచని స్థితిలో కొట్టుకుంటున్నాడు కాంతయ్య.

* * *

"ఈ సంవత్సరం పంట వదిలేద్దామండీ" అంది మంగ నిదానంగా.

పిన్నత్తగారిరాక.... తద్వారా పెరిగే ఖర్చులు బేరీజు వేసుకొని వుడికిపోతున్న ప్రకాశం కస్సుమన్నాడు. "చాల్లే.... మూడేళ్ళపంట వదులుకున్నాం. పైగా ఖర్చులు పెరిగాయి. ఇంక మీ అమ్మగారికి కొబ్బరిబొండాల ఖర్చే నెలకి వంద రూపాయలవుతుంది. పంటయిస్తే తీసుకురా. లేకపోతే అక్కడే తగలడు" విసుగ్గా అక్కడ్నుంచి వెళ్ళగక్కాడు.

అప్పటికే ఎక్కిళ్ళు పెడుతున్న మంగను చూడకుండానే విసురుగా బయటకు వెళ్ళిపోయాడు.

* * *

గొడ్లచావడిలో కునుకుతీస్తున్న కాంతయ్యని "ఇదిగో ....నిన్నే" నిదానంగా పిలిచింది బూదెమ్మ.

"ఏంటీ!" విసుగ్గా చూశాడుకాంతయ్య.

"గోవిందయ్య బస్తాకి ఎనభై ఇస్తానన్నాడు. వడ్లమ్మేసి డబ్బు అమ్మాయికిచ్చెయ్యి. ఇయిగో ఈ సూత్రాలు చెరిపి చిట్టి గొలుసుచేయించు. పిల్లనిబాధపెట్టటం ఎందుకు. ఆ కష్టం ఏదో మనమే పడదాం" అని కళ్ళనీళ్ళు తుడుచుకొని పొలానికి గొడ్లు తోలుకెడుతున్న బూదెమ్మని విచిత్రంగా, జాలిగా. మరేదో తెలియని భావం పెనవేస్తున్నట్టుగా చూస్తుండిపోయాడు కాంతయ్య.

* * *

ఆ మర్నాడు సామాను ఎడ బండికి ఎక్కించి సూరమ్మ బండీ జల్లలో వెనగ్గా కూర్చుని, తీరిగా మంగ చేతిలో పిల్లాణ్ణి అందుకొంది. తలకు కట్టిన ఎర్ర జేబురుమాలు తోకలూ నల్లని వెంట్రుకలు మొహంమీద పడుతుంటే వెనక్కి తోసుకుంటూ, కొత్త చీరలో సుతారంగా విరిసిన మందారంలా వూగుతున్నట్టు నడుస్తూ అందరికీ పేరు పేరునా 'వెళ్లొస్తా' నని చెప్పి బండెక్కుతున్న మంగకు వేపచెట్టుక్రింద కోళ్ళకు మేత పెడుతూ, రేగినజుట్టు మొహంమీద పడుతుంటే ఆ చేత్తోనే ఎగదోసుకుంటూ, లోతుకుపోయిన కళ్ళతో తనకేసి చూస్తున్న బూదెమ్మ కనిపించింది.

ఆమెకుకూడా చెబుదామని వెనక్కి తిరిగిన మంగ మనవడి చిట్టి గొలుసు నాట్యంచూస్తున్న సూరమ్మ "ఎక్కమ్మా. ఎక్కు. పొద్దెక్కితే పిల్లాడు ఎండలో యిబ్బందిపడతాడు" అని హెచ్చరించటంతో మళ్ళీ బండి యెక్కేసింది.

బండి క్రమంగా బాటమీద సాగిపోతోంది. బూదెమ్మ బరువుగా భూదేవిమీద అడుగులువేస్తూ గడ్డపార, తట్ట తీసుకొని మట్టిపనికి కూలికి వెళ్ళిపోయింది. ●

